మాజీ మంత్రిని కలిసిన సంఘాల నాయకులు


ఎమ్మెల్యే గంగులను సత్కరిస్తున్న కరీంనగర్ ఆల్ ఫోర్ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గం

కార్పొరేషన్, ఫిబ్రవరి 16: కరీంనగర్ ఆల్ ఫోర్ వీలర్స్ మెకానిక్ వెల్ఫేర్ సొసైటీ నూతన కార్యవర్గం ఆదివారం మాజీ మంత్రి, కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి, శాలువా కప్పి సత్కరించారు. నూతనంగా ఎన్నికైన సభ్యులను సంఘ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో నూతన అధ్యక్షుడు కానుగంటి రమేశ్, ప్రధాన కార్యదర్శి జాప మునీందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడు బాబా, గౌరవాధ్యక్షుడు వడ్లూరు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

- ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను రాంనగర్ బీసీ సంఘానికి చెందిన యువకులు ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు.

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కుల గణన సర్వేలో బీసీ కులాలకు చెందిన వారి సంఖ్యను తక్కువగా చూపించారని, కుల గణన సర్వే మళ్లీ నిర్వహించాలని బీసీ కులాల తరపున ఎమ్మెల్యే చేస్తున్న పోరాటానికి మద్దతు పలికారు. కార్యక్రమంలో సంఘ నాయకులు శ్రీకాంత్, సాయి చరణ్, శేఖర్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనుల్లో నిర్లక్ష్యం

- నిత్యం దుమ్ము-ధూళితో జనం సతమతం

కొత్తగట్టు గ్రామంలో వాహనాల రాకపోకలతో వ్యాపిస్తున్న దుమ్ము, ధూళి

శంకరపట్నం, ఫిబ్రవరి 16: జాతీయ రహదారి ఎన్‌హెచ్-563 నిర్మాణ సంస్థ నిర్వాహకుల నిర్వాకంతో ప్రయాణికులు, రోడ్డు పక్కన ఉన్న ఇండ్లల్లో నివసించే వారు దుమ్ము-ధూళితో సతమతమవుతున్నారు. కొత్తగట్టు నుంచి తాడికల్ వరకు నిర్మిస్తున్న నాలుగు లేన్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతుండగా, కొత్తగట్టు, మొలంగూర్, కేశవపట్నం, తాడికల్ శివార్లలో రోడ్డు పక్క నుంచి వాహనాల రాకపోకల వల్ల దుమ్ము లేచి ఇండ్లల్లో నివసించే వారితో పాటు ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. రోడ్డు నిర్మాణ సంస్థ నిర్వాహకులు రోడ్డు పనుల సందర్భంగా దుమ్ము-ధూళి వ్యాపించకుండా నీటిని చల్లవలసి ఉండగా, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఓ వైపు ప్రయాణికుల కళ్లల్లో పడడంతోపాటు, శరీరం దుమ్ము కొట్టుకుపోతుండగా, మరోవైపు రోడ్డు పక్కన ఉన్న ఇండ్లల్లోకి దుమ్ము ధూళి వ్యాపించి రోగాల బారిన పడుతున్నట్లు పలువురు కొత్తగట్టు వాసులు వాపోతున్నారు. నిత్యం తమకు ఇదో శిక్షగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి సంస్థ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పాటు అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల తాము ఇన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నా పట్టించుకోరా.. అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ అభ్యర్థులకు ఎందుకు ఓట్లేయాలి?

- టీచర్లు, గ్రాడ్యుయేట్ల పక్షాన ఒక్కనాడైనా పోరాటాలు చేశారా?
- కేంద్ర మంత్రి బండి సంజయ్

మాట్లాడుతున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్

విద్యానగర్, ఫిబ్రవరి 16: టీచర్, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి కాంగ్రెస్ పార్టీకి అర్హతే లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ విమర్శించారు. 'టీచర్లు, గ్రాడ్యుయేట్ల పక్షాన ఎన్నడైనా పోరాటాలు చేశారా? 317 జీవోకు వ్యతిరేకంగా ఎన్నడైనా కొట్లాడారా? గ్రూప్ 1 సహా నిరుద్యోగుల పక్షాన ఎన్నడైనా జైలుకు వెళ్లారా? మరి కాంగ్రెస్ అభ్యర్థులకు ఎందుకు ఓట్లేయాలి?' అని ప్రశ్నించారు. 'టీచర్లు, నిరుద్యోగుల సమస్యలపై నిరంతరం కొట్లాడింది, జైలుకు వెళ్లింది, లాఠీదెబ్బలు తిన్న చరిత్ర బీజేపీదే...' అని స్పష్టం చేశారు. నగరంలో ఆదివారం కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ ఎమ్మెల్సీ నియోజకవర్గ సోషల్ మీడియా కార్యకర్తల సమావేశంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ పాల్గొని వారిని ఉద్దేశించి మాట్లాడారు. ఇప్పుడు కాంగ్రెస్ పక్షాన టీచర్, గ్రాడ్యుయేట్ అభ్యర్థులుగా పోటీ చేస్తున్న వారు ఎన్నడైనా ఒక్క పోరాటమైనా చేశారా? అని ప్రశ్నించారు. టీచర్లు, నిరుద్యోగుల సమస్యలపై ప్రభుత్వ మెడలు వంచిన చరిత్ర బీజేపీదేనన్నారు. దీనిని ప్రజలకు వివరించి బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్వీఎస్ ప్రభాకర్, మాజీ మేయర్ సునీల్ రావు, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి జే సంగప్ప తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర కుటుంబ సర్వేకు మరో అవకాశం

- కలెక్టర్ పమేలా సత్పతి

కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : జిల్లాలో సమగ్ర కుటుంబ సర్వేకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించినట్లు కలెక్టర్ పమేలా సత్పతి తెలిపారు. ఈనెల 16 నుంచి 28 వరకు ఈ సర్వే కొనసాగనున్నదని, ఇందులో మూడు విధాలుగా వివరాలు నమోదు చేసుకోవచ్చని వెల్లడించారు. వివిధ కారణాలతో ఇప్పటివరకు సర్వేలో పాల్గొనని కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. సర్వే కోసం జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కాల్‌సెంటర్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 040-21111111 నంబర్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ వివరాలు నమోదు చేసుకోవచ్చన్నారు. ఇంతకుముందు సర్వేలో పాల్గొనని వారు నేరుగా ప్రజాపాలన సేవాకేంద్రాల్లో సంప్రదించి, వివరాలు సిబ్బందికి అందజేస్తే నమోదు చేస్తారని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా సర్వే ఫారం డౌన్‌లోడ్ చేసుకుని, వివరాలు నింపి ఆ ఫారాన్ని ప్రజాపాలన సేవా కేంద్రాల్లో అందజేయవచ్చన్నారు. http;\\ seeepcsurvey. cgg.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అయిన సర్వే ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. తమ కుటుంబాల పేర్లు నమోదు చేసుకోని వారు పై మూడు పద్ధతుల్లో ఏదో ఒక విధానంలో రీ సర్వేలో పాల్గొనాలని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో కలెక్టర్ కోరారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసనలు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వ బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఈ నెల 18, 19 తేదీల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తెలిపారు. కేంద్ర బడ్జెట్‌లో మోదీ ప్రభుత్వం ప్రజల మౌలిక అవసరాలకు కేటాయింపులు తగ్గించినట్లు ఆరోపించారు. సంపన్నులకు రాయితీలు పెంచిందని, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా బడ్జెట్‌లో నిధులు కేటాయింపు జరిపిందని విమర్శించారు. బడ్జెట్‌ను సవరించి పేద మధ్యతరగతి ప్రజల సంక్షేమానికి కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేశారు. లక్షలకోట్ల విలువైన కేంద్ర సంస్థలను బీజేపీ అనుకూల కంపెనీలకు అప్పనంగా విక్రయిస్తున్నారని ధ్వజమైత్తారు. బీమా రంగంలో వందశాతం విదేశీ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి నిబంధనలు సవరించడం సరికాదన్నారు. ఉపాధి హామీ పథకానికి నిధుల్లో కోతపెట్టి, గ్రామీణ పేద ప్రజల ఆర్థికాభివృద్ధిని అడ్డుకుంటున్నదని దుయ్యబట్టారు. ప్రజాపంపిణీ వ్యవస్థను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తీసుకురావాలన్నారు. కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ చేపడుతున్న నిరసన కార్యక్రమాలను గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో విజయవంతం చేయాలని వారు ఆదివారం ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులను కోరారు.

లేబర్ కోడ్లు వెంటనే రద్దు చేయాలి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 16: కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరించేలా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ డిమాండ్ చేశారు. జిల్లా బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూపొందించిన డైరీ, నూతన సంవత్సరం క్యాలెండర్‌ను యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ, కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినాటి నుంచి కార్మిక చట్టాలను కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్చుచేస్తున్నదని మండిపడ్డారు. కార్మికులకు న్యాయంగా దక్కాల్సిన సంక్షేమ పథకాల్లో కోత పెడుతున్నదని విమర్శించారు. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలతో ఇసుక లభించక భవన నిర్మాణ పనులు ఆగిపోతున్నాయని, దీంతో కార్మికులకు పనులు దొరకడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక రవాణా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికశాఖకు నిధులు కేటాయించి కార్మికులకు రావాల్సిన బకాయిలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కదిరే రమేశ్, జగదీశ్. మల్లారెడ్డి, వెంకన్న, సారయ్య పాల్గొన్నారు.

నాడు రాజదర్పం.. నేడు శిథిల భవనం

గంగాధర, ఫిబ్రవరి16: ఎందరో ప్రముఖులకు ఆతిథ్యం ఇచ్చిన మండల కేంద్రంలోని ప్రభుత్వ గెస్ట్‌హౌస్ నేడు వినియోగంలో లేక శిథిలావస్థకు చేరుకున్నది. మండల కేంద్రంలో సకల సౌకర్యాలతో నిర్మించిన గెస్ట్‌హౌస్‌ను 1962లో అప్పటి పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి మర్రి చెన్నారెడ్డి ప్రారంభించారు. అప్పటినుంచి దాదాపు 40ఏండ్ల పాటు సీఎం నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలు, సినిమా హీరోలు, జాతీయ స్థాయి క్రీడాకారులు, ముఖ్య నేతలు ఎవరు వచ్చినా వారికి ఈ గెస్ట్‌హౌస్ అతిథ్యం ఇచ్చింది. 20 ఏండ్లుగా ఆలనా పాలన లేకపోవడంతో శిథిలావస్థకు చేరువైంది. ప్రజాప్రతిధులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించి గెస్ట్‌హౌస్‌కు పూర్వ వైభవం తీసుకురావాలని మండల ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థకు చేరుకున్న గెస్ట్‌హౌస్

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

కలల లోగిలి పుస్తకావిష్కరణ

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 16 : జిల్లా కేంద్రంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో భవానీ సాహిత్య వేదిక ఆధ్వర్యంలో నగునూరి రాజన్న రచించిన కలల లోగిలి పుస్తకాన్ని వైరాగ్యం ప్రభాకర్ అధ్యక్షతన వ్యంజకాలు ప్రక్రియ రూపకర్త పొత్తూరి సుబ్బారావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ, 'కలల లోగిలి' లోని కవితలు మానవ సంబంధాలు, మానవతా విలువలను పెంపొందించేలా ఉన్నాయని అభినందించారు. కవిత్వంలో అంతర్లీనంగా ఉన్న భావనలను పాఠకుడు అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు దాస్యం సేనాధిపతి, వైఎస్ శర్మ, కొలగాని శ్రీనివాస్, మాడిశెట్టి గోపాల్, కేవీ గోపాలాచార్య, బొమ్మకంటి కిషన్, సంగనభట్ల చిన్న రామకిష్టయ్య, జనగాని యుగంధర్, నడిమెట్ల రామయ్య, ఇటిక్యాల రాము తదితరులు పాల్గొన్నారు.

నాకు న్యాయం చేయండి..

- పురుగుల మందు డబ్బాతో సెల్ టవర్ ఎక్కి నిరసన

శంకరపట్నం: మండల కేంద్రంలో సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న దుర్గం కొమురయ్య

శంకరపట్నం, ఫిబ్రవరి 16: తమపై భౌతిక దాడికి దిగిన సోదరుడిపై ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదంటూ సైదాపూర్ మండలం ఎక్లాస్‌పూర్ గ్రామానికి చెందిన దుర్గం కొమురయ్య ఆదివారం పురుగుల మందు డబ్బాతో శంకరపట్నం మండల కేంద్రంలోని ఓ సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. తన తమ్ముడు తిరుపతి ఇటీవల తనతో పాటు తన భార్యపై దాడికి పాల్పడ్డాడని, ఈ ఘటనతో మానసిక క్షోభకు గురైన తన భార్య పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేయగా, దవాఖానలో చేర్పించి చికిత్స చేయించామని, వైద్యులు నిన్ననే డిశ్చార్జి చేశారని కొమురయ్య తెలిపాడు. తమపై అకారణంగా దాడికి పాల్పడిన తన తమ్ముడిపై చర్యలు తీసుకోవాలని సైదాపూర్ పోలీసులతో పాటు సీపీకి సైతం ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించాడు. తనకు న్యాయం జరుగకపోతే సెల్ టవర్ పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించాడు. సమాచారం అందుకున్న కేశవపట్నం బ్లూకోల్ట్స్ పోలీసులు అక్కడకు చేరుకుని న్యాయం చేస్తామని నచ్చజెప్పడంతో సెల్ టవర్ దిగాడు. అతడిని పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

పోలింగ్ కేంద్రాల తుది జాబితా విడుదల

కలెక్టరేట్, ఫిబ్రవరి 16 : ప్రాదేశిక ఎన్నికల ప్రక్రియ పనులు జిల్లాలో శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఓటింగ్ నిర్వహణకు సంబంధించి ఎన్నికల అధికారుల నియామకం, శిక్షణ కార్యక్రమాలు కూడా పూర్తి చేసిన యంత్రాంగం, పోలింగ్ కేంద్రాల తుదిజాబితా కూడా శనివారం రాత్రి విడుదల చేసింది. జిల్లా వ్యాప్తంగా 15 జిల్లా ప్రాదేశిక, 170 మండల ప్రాదేశిక స్థానాలు ఉండగా, వీటికి సంబంధించి 930 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు, తుది జాబితాలో ప్రకటించారు. జిల్లాలో మొత్తం 5,09,130 మంది ఓటర్లుండగా, ఇందులో 2,61,038 మంది స్త్రీలు, 2,48,080 మంది పురుషులు ఉన్నారు. మరో 12 మంది ఇతరులుండగా, 400 లోపు ఓటర్లున్న ప్రాంతాల్లో 85, 500 లోపు ఉన్న చోట 251, 750 లోపు ఓటర్లున్న ప్రాంతాల్లో 594 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు. కలెక్టర్ ఆమోదంతో తుదిజాబితాను ఎన్నికల సంఘానికి పంపుతున్నట్లు సంబంధితాధికారులు ఆదివారం పేర్కొన్నారు.

'వృక్షార్చన' వాల్ పోస్టర్ ఆవిష్కరణ

మధురానగర్‌లో వృక్షార్చన వాల్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న యూత్ నాయకులు

గంగాధర, ఫిబ్రవరి 16 : ఈ నెల 17న తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ యువజన విభాగం ఆధ్వర్యంలో మండలంలోని మధురానగర్ చౌరస్తాలో ఆదివారం 'వృక్షార్చన' వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ యూత్ నాయకుడు పుట్కం రవీంద్రనాథ్ ఠాగూర్ మాట్లాడుతూ, కేసీఆర్ జన్మదినం సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, గ్రీన్ ఇండియా చాలెంజ్ రూపకర్త జోగినపల్లి సంతోష్‌కుమార్ పిలుపు మేరకు యూత్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో మొక్కలు నాటి, వృక్షార్చన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆదేశాల మేరకు గోడప్రతిని ఆవిష్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు అజ్జు, మధు, హరికృష్ణ, శశికరణ్, విజయ్, రాంకీ, లవకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేస్తున్న ఎమ్మెల్సీ అభ్యర్థి రవీందర్ సింగ్

క్రీడల్లో గెలుపోటములు సహజం

తిమ్మాపూర్ రూరల్, ఫిబ్రవరి 16: క్రీడల్లో గెలుపోటములు సహజమని, వాటిని క్రీడాస్ఫూర్తితో తీసుకున్న వారే జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహిస్తారని ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ పేర్కొన్నారు. ఆదివారం మండలం మన్నెంపల్లి గ్రామంలో మాజీ ఉప సర్పంచ్ పొన్నం అనిల్ గౌడ్ తన తండ్రి చంద్రయ్య గౌడ్ స్మారకార్థం నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఫైనల్ మ్యాచ్‌కు ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్ హాజరయ్యారు. విజేతలకు ప్రైజ్ మనీని అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ సింగ్ మాట్లాడుతూ, క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక దృఢత్వానికి దోహదపడుతాయని, యువత క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ముస్సగూరు గోవింద రావు, గుంజపడుగు హరిప్రసాద్, భారత్ కుమార్ శర్మ, సుదగోని సదయ్య, నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 16: పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణ పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చామనపల్లి గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచార సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పట్టభద్రుల సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందని, ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో చామనపల్లి, చెర్లభూత్కూర్, బహద్దూర్ ఖాన్‌పేట, దబ్బపల్లి, తాహెర్ కొండాపూర్, ఫకీర్ పేట గ్రామాల పట్టభద్రులు, తదితరులు పాల్గొన్నారు.

రాగంపేటలో పరిశ్రమలు స్థాపించండి

చొప్పదండి, ఫిబ్రవరి16 : మండలంలోని రాగంపేట పరిశ్రమలు, మిల్లులు, వ్యాపార సంస్థలు స్థాపించడానికి అత్యంత అనువైన ప్రదేశమని, వ్యాపారవేత్తలు తమ సంస్థలు స్థాపిస్తే గ్రామ పంచాయతీ, ప్రజలు అన్ని విధాలా సహకరించడానికి సిద్ధంగా ఉన్నారని మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. రాగంపేటలో భారత్ పెట్రోలియం పంపు ప్రారంభోత్సవంలో కృష్ణారెడ్డి పాల్గొని పంపు యజమాని భాగవతుల నరేశ్‌కుమార్‌ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర రహదారి ఆర్నకొండ నుంచి రాగంపేట మీదుగా మల్యాల వరకు డబుల్‌రోడ్డు నిర్మాణం కానున్నదని, పరిశ్రమలకు కావాల్సిన నీటితో పాటు రాగంపేటలో నైపుణ్యం కలిగిన కార్మికులు పుష్కలంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు బొమ్మరవేణి భూమయ్య, యామ మునీందర్, దీటి వెంకటేశ్, అడిగొప్పుల సాయికుమార్, గుండె వెంకటేశ్, తీగల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఏపీ రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్

విద్యానగర్, ఫిబ్రవరి 16: కరీంనగర్ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఆదివారం కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని ఆంధ్రప్రదేశ్ రజక కార్పొరేషన్ చైర్‌పర్సన్ సి. సావిత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. సంత్ గాడ్గే బాబా జన్మదినం ఫిబ్రవరి 23వ తేదీని పురస్కరించుకొని సఫాయి కర్మచారి దివస్‌గా ప్రకటించేలా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా రజక సంఘం నాయకులు కొత్తకొండ రాజా, రాజన్నసిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు దుబ్బాక రమేశ్, అక్కర శ్రీనివాస్, రవీందర్, ఉప్పరపల్లి శ్రీనివాస్, కొన్నాల రాము, గుండారం సంపత్, ఇసపెల్లి మహేశ్, శ్రీనివాస్, మడక సంపత్, చింత శ్రీనివాస్, కొల్లు రాజు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం

చిగురుమామిడి, ఫిబ్రవరి 16: మండలంలోని రేకొండ గ్రామంలో 1990-91 పదో తరగతి మిత్రబృందం సభ్యుడు అరిగేల సమ్మయ్య తండ్రి కొమురయ్య ఇటీవల మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని మిత్రులు పరామర్శించి 50 కిలోల బియ్యం, నగదు అందజేశారు. అలాగే, గ్రామంలో దుడ్డేల శ్రీనివాస్ అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని మిలీనియం ఫ్రెండ్స్ అసోసియేషన్ సభ్యులు పరామర్శించి, లక్షా వేయి రూపాయలు అందించి అండగా నిలిచారు. ఆయా కార్యక్రమాల్లో మిత్ర బృందం సభ్యులు కలువల సంపత్ రెడ్డి, గొడిశాల శ్రీనివాస్, దుడ్డేల సుదర్శన్, రవీందర్, పెద్ది సమ్మయ్య, అరిగెల తిరుపతి తోపాటు మిలీనియం అసోసియేషన్ అధ్యక్షుడు తిప్పారపు సురేశ్, కార్యదర్శి చిప్ప తిరుపతి, ఉపాధ్యక్షుడు పరిపాటి మైపాల్ రెడ్డి, కోశాధికారి లంకసిరి శ్రీనివాస్, అప్పాల రమేశ్, పరకాల రమేశ్, బండారి రవి, రాజు, సంపత్ రెడ్డి, వెంకన్న, సునీల్, శ్రీనివాస్, ప్రశాంత్ చారి, గంగాధర్, రజక సంఘం అధ్యక్షుడు దుడ్డేల లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

సరస్వతీ శిశుమందిర్‌కు రూ.లక్ష విరాళం

పాఠశాల భవన నిర్మాణం కోసం లక్ష రూపాయల విరాళం అందజేస్తున్న కేశెట్టి మహేశ్

విద్యానగర్, ఫిబ్రవరి 16: జిల్లా కేంద్రంలో శ్రీ సరస్వతీ విద్యాపీఠం ద్వారా నిర్వహిస్తున్న శ్రీ సరస్వతీ శిశు మందిర్ ఉన్నత పాఠశాలను ఇంటర్నేషనల్ స్కూల్‌గా మార్చాలని విద్యాపీఠం సంకల్పించింది. ఇందులో భాగంగా పాఠశాలలో చేపట్టిన భవన నిర్మాణానికి కేశెట్టి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు మహేశ్ ఆదివారం రూ.లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానాచార్యుడు సముద్రాల రాజమౌళి, పాఠశాల అధ్యక్షుడు బల్మూరి కరుణాకర్ రావు, కార్యదర్శి ఇంజినీర్ కోల అన్నారెడ్డి, సమితి అధ్యక్షుడు డాక్టర్ చక్రవర్తుల రమణాచారి, సమితి కార్యదర్శి ఎలగందుల సత్యనారాయణ, విభాగ్ కార్యదర్శి మేచినేని దేవేందర్ రావు, సహ కార్యదర్శి కొండ గంగాధర్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, పుల్లల శ్యామ్, రాపర్తి శ్రీనివాస్, తాటి రాజేశ్వర్ రావు, చందా సుధాకర్, శ్రీరాం మొండయ్య, డాక్టర్ సత్యవిద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

ప్లే స్కూల్‌లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

వేడుకల్లో నృత్యం చేస్తున్న చిన్నారులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 16 : నగరంలోని జగిత్యాల రోడ్డులో గల ది ప్లే స్కూల్ (కిండర్ గార్డెన్)లో ఆదివారం సాయంత్రం వార్షిక గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రత్యేక న్యాయాధికారి బొల్ల జయశ్రీ, ప్రముఖ వైద్యుడు రఘురామన్, ఎన్ఐఏకు చెందిన సీనియర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. విశాల్ గౌతమ్ హాజరయ్యారు. గ్రాడ్యుయేషన్ డేలో భాగంగా ప్రీ ప్రైమరీ యూకేజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమాన్ని నిర్వహించడంపై అతిథులు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం సంస్కృతీ సాంప్రదాయాలు, దేశభక్తిపై విద్యార్థులు ప్రదర్శించిన కార్యక్రమాలు కనువిందు చేశాయి. పాఠశాల చైర్మన్ డాక్టర్ పొల్సాని సుధాకర్‌రావు మాట్లాడుతూ, ది ప్లే స్కూల్‌లో పూర్తి అంకితభావంతో విద్యనందిస్తూ విద్యార్థుల భవిష్యత్తును అత్యుత్తమంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ గ్రాడ్యుయేషన్ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు

మానకొండూర్, ఫిబ్రవరి 16: మానకొండూర్ మండల కేంద్రానికి చెందిన దస్తావేజుల లేఖరి ఆడప వినయ్, అతడి కుటుంబ సభ్యులు ఆడప వీరయ్య, ఆడప దివ్య, నరహరి వెంకటేశ్వర్‌పై ఆదివారం మానకొండూర్ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదైనట్లు సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు. సీఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మానకొండూర్ గ్రామంలోని సర్వేనం 1157ఇలో పూర్వీకులకు చెందిన 24 గుంటల వ్యవసాయ భూమికి నకిలీ సాదాబైనామా పత్రాలు సృష్టించి, మోసపూరితంగా మ్యూటేషన్ చేయించడం, ఆ భూమిని కుటుంబ సభ్యులపై విక్రయదస్తావేజులు చేయడం వంటి అక్రమాలు వెలుగు చూశాయి. ఆడప కిష్టయ్య ఫిర్యాదు మేరకు వినయ్, అతడి కుటుంబ సభ్యులపై కే